క్లుప్తంగా

వెదురు సాగుతో ఆదాయం



మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఐరాల: గ్రామాల్లో వెదురు సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని ఏపీఎం నాగరత్న అన్నారు. మంగళవారం మండలంలోని బొమ్మ సముద్రంలో ఎన్ఆర్ఎల్ఎం సేర్ప్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో మహిళా రైతులకు వెదురు మొక్కల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎంతోపాటు డీపీఎం మధు మాట్లాడారు. ఒకసారి వెదురు మొక్కలు నాటితే చాలా ఏళ్లపాటు ఆదాయం పొందవచ్చన్నారు. చాలా తక్కువ నీటితోనే సాగవుతుందని, కోత తర్వాత కూడా అవి మళ్లీ పెరుగుతాయన్నారు. అంతేకాకుండా వెదురుకు ఎలాంటి చీడ పీడలు ఆశించవన్నారు. కార్యక్రమంలో సేర్ప్ జేపీఈ వెంకటరావు, పంచాయతీ కార్యదర్శి రమ్య, ఏపీఎం ఎఫ్‌పీఓ సురేష్, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరానికి స్పందన



పశువులకు డీ టికింగ్ మందు పిచికారీ చేస్తున్న పశు వైద్య సిబ్బంది

ఐరాల: పాడి రైతులు పశువుల పెంపకంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ రెడ్డిరాము అన్నారు. మండలంలోని 35 యర్లంపల్లెలో మంగళవారం చిత్తూరు ఏరువాక కేంద్రం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించింది. తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎస్వీ వ్యవసాయ కళాశాల తిరుపతి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లావణ్య ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో దాదాపు 70 శాతం మంది రైతులు వ్యవసాయం, పశువుల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. పశువులకు వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శిబిరంలో 180 ఆవులకు డీ టికింగ్ స్ప్రే చేశారు. 40 దూడలకు నట్టల నివారణకు మందులు తాపించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయ సిబ్బంది శ్రీలేఖ, నరసింహులు పాల్గొన్నారు.

నేటి నుంచి అర్ధగిరికి ఆర్టీసీ సర్వీసులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): తవణంపల్లె మండలంలోని అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి క్షేత్రానికి కొత్తగా రెండు సర్వీసులు నడుపుతున్నట్టు చిత్తూరు-1 డిపో మేనేజర్ క్రిష్ణమూర్తి తెలిపారు. చిత్తూరు నుంచి ఉదయం 6, 7.30 గంటలకు, మధ్యాహ్నం 3.30 గంటలకు, అలాగే అర్ధగిరి నుంచి ఉదయం 8.40, సాయంత్రం 4.40 గంటలకు ఈ సర్వీసులు బుధవారం నుంచి ప్రారంభమవుతాయని, భక్తులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నూతనోత్సాహం

- చిత్తూరులో అర్ధరాత్రి నుంచి వేడుకలు
- రెస్టారెంట్లు, హోటళ్లలో ఆఫర్ల మోత
- కేక్‌లు, పుష్పగుచ్ఛాలకు ఆర్డర్లు ఫుల్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): 2024కు వీడ్కోలు పలికి 2025కు స్వాగతం పలికారు. అర్ధరాత్రి నుంచి ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు మొదలయ్యాయి. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ఉత్సాహంలో మునిగి తేలారు. ఎన్నో అనుభూతులు.. మరెన్నో అనుభవాలు.. సుఖ సంతోషాలు.. బాధలు.. చేదు ఫలితాలను పంచిన సంవత్సరానికి వీడ్కోలు చెప్పారు. మరోవైపు వినియోగదారులను ఆకర్షించేందుకు రెస్టారెంట్లు, హోటళ్లు నూతన సంవత్సరం ఆఫర్ల మోత మోగిస్తున్నాయి. కాంబో ఆఫర్లు ప్రకటించాయి. పూల బొకేల షాపులు, కేక్‌ల దుకాణాలు కిటకిటలాడాయి.

నూతన సంవత్సర వేడుకలకు చిత్తూరు నగర ప్రజలు కొంతమంది పుణ్యక్షేత్రాలకు వెళుతుంటే మరికొందరు రిసార్ట్‌లకు ఎంచుకున్నారు. ముందస్తుగానే బుక్ చేసుకుని కుటుంబ సమేతంగా కేరింతలు కొడుతున్నారు. ఎక్కువగా కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల్లోని రిసార్ట్‌లను వెళ్లగా, కొందరు చిత్తూరు నగర పరిసర ప్రాంతాల్లోని రిసార్ట్‌లకు వెళ్లి నూతన సంబరంలో మునిగి తేలుతున్నారు. దీంతో రిసార్ట్‌లు సందడి..సందడిగా కనిపిస్తున్నాయి.

ఆఫర్లు ఇలా....

బిర్యానీలు, మాంసాహారం విక్రయాలు మంగళవారం పెద్ద ఎత్తున ప్రారంభమయ్యాయి. హోటళ్లలో బిర్యానీ కాంబో ఆఫర్లు అదిరిపోతున్నాయి. ప్రకటనలు చూసి ప్రజలు హోటళ్లలో వాలిపోతున్నారు. సాయంత్రం నుంచి ఆ హోటళ్ల వద్ద ఆఫర్లను చూసి క్యూకడుతున్నారు. ఆఫర్లు ప్రకటించిన అన్ని హోటళ్లు, రెస్టారెంట్లు కిటకిటలాడుతున్నాయి. ఇక చికెన్‌షాపులు కూడా కేజీ చికెన్ కొంటే రూ.20 తగ్గుదల, నాలుగు కోడి గుడ్లు ఫ్రీ అంటూ ప్రకటించాయి.



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న ఓ బేకరీ



పూల బొకేలతో ఉన్న దుకాణం

జోరుగా బొకేలు.. కేకుల విక్రయాలు

నూతన సంవత్సర వేడుకల్లో బొకేలు.. కేక్‌లు ప్రధానమైనవి. పెద్ద ఎత్తున సాగే వీటి కోసం పువ్వుల దుకాణాలు, బేకరీ యజమానులు ముందస్తుగా అమ్మకానికి రోడ్డుపైకి వచ్చారు. బొకేల కోసం తెప్పించిన ప్రత్యేక పూలతో మార్కెట్ కళకళలాడుతోంది. రేట్లు కూడా అమాంతంగా పెరిగాయి. అలాగే కేక్‌లకు ఆర్డర్లు పుష్కలంగా రావడంతో బేకరీ నిర్వాహకులు రకరకాల కేక్‌లను ఆకట్టుకునేలా తయారీ చేశారు. వీటి అమ్మకాలు సైతం జోరందుకున్నాయి.

యూటీఎఫ్ క్యాలెండర్లు, డైరీల ఆవిష్కరణ



యూటీఎఫ్ క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ

నగరి: డివిజన్ స్థాయిలో యూటీఎఫ్- 2025 డైరీ, క్యాలెండర్లు, జీవో బుక్, ఎస్ఎస్‌సీ స్టడీ మోడల్ పేపర్లను మంగళవారం ఆర్డీఓ భవాని శంకరి ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని, బోధనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మేళవించి చెప్పాలన్నారు. యుటీయఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్ మాట్లాడుతూ, జనవరి 5,6,7,8వ తేదీలలో కాకినాడలో రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలకు ఉపాధ్యాయులు, విద్యారంగ మేధావులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ మునిరత్నం, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు వంశీకృష్ణ, రవీంద్రబాబు, మండల నాయకులు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, యువరాజ్, ప్రకాష్, సంతోష్, సురేష్ బాబు, హరి ప్రసాద్, విజయ్ కుమార్, భాగ్యరాజ్, పయని తదితరులు పాల్గొన్నారు.

అపోలోలో 2కే రన్



2కే రన్‌లో విద్యార్థులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం మురకంబట్టులోని అపోలో కాలేజీలో మంగళవారం ఫిట్ ఇండియా వీక్ సంబరాలలో భాగంగా 2కే రన్ నిర్వహించారు. కాలేజీ వైస్ చాన్సలర్ వినోద్‌భట్ ఈ రన్‌ను ప్రారంభించారు. విద్యార్థికి చదువుతో పాటు వ్యాయామం అవసరమని, ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయడం దినచర్యగా చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు రామసుబ్బయ్య, రాకేష్, ప్రవీణ్, రమ్య, దిలీప్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ పథకాలపై అవగాహన

ఐరాల: వ్యవసాయ పథకాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి ప్రసన్నలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని 35 యర్లంపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఏఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో ఎస్వీ వ్యవసాయ కళాశాల తిరుపతి విద్యార్థులకు వ్యవసాయ పథకాలపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ, రబీ సీజన్‌లో క్రాప్ బుకింగ్, సీఎల్ఎస్, ఎన్పీడీఎస్ యాప్‌లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్రోన్ టెక్నాలజీ వలన రైతులకు కలిగే లాభాలు, నానో ఎరువులు వాడకం తదితర విషయాలపై క్షుణ్ణంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. జెడ్‌బీఎన్ఎఫ్(జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్)కు సంబంధించి ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది భారతి వివరించారు. అలాగే చినకాంపల్లెలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్వీ వ్యవసాయ కళాశాల తిరుపతి ప్రొఫెసర్ డాక్టర్ లావణ్య, వీఏఏలు జోత్స్న, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న డీఆర్‌సీ ప్రసన్నలక్ష్మి

ట్రాన్స్‌కో ఉద్యోగుల డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా ట్రాన్స్‌కో టీసీ ఉద్యోగుల సంఘం డైరీ, క్యాలెండర్లను మంగళవారం తన కార్యాలయంలో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ చేతుల మీదుగా యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. ఎస్ఈ మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ డిస్కం అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శేషాద్రిరెడ్డి, ఉమ్మడి జిల్లా కార్యదర్శి చంద్రమౌళి, నాయకులు వివేకానందరెడ్డి, గజేంద్ర, హిమావంత్ కుమార్, నరేష్ పాల్గొన్నారు.



డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

ముస్తాబైన ఆలయాలు

బంగారుపాళెం: నూతన ఆంగ్ల సంవత్సరానికి మండలంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. మండలంలోని మొగిలి శివాలయం, బంగారుపాళెంలోని ముత్యాలమ్మ ఆలయం, ఓం శక్తి ఆలయం, నలగాంపల్లెలోని శ్రీవేంకటేశ్వరాలయం, మొగిలి వెంకటగిరిలోని రామాలయం, వజ్రాలపురంలోని బోయకొండ గంగమ్మ ఆలయాలతో పాటు వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. ఆలయాలను పచ్చని మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు.

డీబీ పల్లెలో రెవెన్యూ సదస్సు

గుడిపాల: రైతుల సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం డీబీ పల్లెలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, భూ సమస్యలపై అర్జీ ఇస్తే 45 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ లక్ష్మి, సర్వేయర్ గోపి, ఆర్ఐ రమాసాయి పాల్గొన్నారు.

చట్టాలు, పౌర హక్కులపై అవగాహన



పాలేరులో పౌరహక్కులపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

బంగారుపాళెం: దళిత, గిరిజనులు చట్టాలను తెలుసుకుని చైతన్యవంతులు కావాలని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని పాలేరు దళితవాడలో మంగవారం సాయంత్రం పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఎస్సీ,ఎస్టీ సామాజిక వర్గాల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. ఎస్సీ, ఎస్టీలపై అగ్రవర్ణాలు వివక్ష చూపి అణగదొక్కే చర్యలకు పాల్పడితే అట్రాసిటీ కేసులు తప్పవని హెచ్చరించారు. ఏఎస్ఐ రామచంద్రారెడ్డి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయకుమార్, ఆర్ఐ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.